క్లుప్తంగా

నాటిన మొక్కలను సంరక్షించాలి



రింగన్‌ఘాట్‌లోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

కెరమెరి: నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొఠారి, రింగన్‌ఘాట్ పంచాయతీలో కొనసాగుతున్న నర్సరీని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. అనంతరం ఎక్కడ మొక్కలు నాటారో తెలుసుకుని నాటిన మొక్కలకు నీరుపోశారు. అనంతరం పల్లె ప్రకృతివనాలు, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఈజీఎస్ ఎఫ్ఏ సోము తదితరులు ఉన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ



కిట్ అంద చేస్తున్న ఎస్సై విజయ్‌కుమార్

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి గ్రామానికి చెందిన యువకులకు ఎస్సై విజయ్‌కుమార్ గురువారం వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. యువత సన్మార్గంలో పయనించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవాజీ, ఏఎస్సై గంగారాం, యువకులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



ప్రారంభిస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ కోరారు. మండలంలోని వీరవెల్లి పంచాయతీ కార్యాలయంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి వెలుగు పరీక్ష కేంద్రం వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్, సర్పంచ్ ద్రౌపతి, హెచ్ఈఓ సోనాజీ, సిబ్బంది స్నేహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ తుకారం మహరాజ్ జయంతి



పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్‌లో గురువారం రాత్రి సంత్ తుకారం మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో మహరాజ్ పల్లకిని భక్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని తెలిపారు. ప్రతి ఏటా గ్రామంలో మహరాజ్ జయంతి వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు ఆలయ కమిటీ సభ్యులు దిలీప్, మణిరాం, విలాస్, వానుపటేల్, బాలాజీ, తులసీరామ్, బాపన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు తరలిన నాయకులు



తరలివెళ్తున్న సంఘాల నాయకులు

బెజ్జూర్: దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈనెల 11, 12 తేదీల్లో జరగనున్న భారత్ బచావో జాతీయ సదస్సుకు జిల్లా నుంచి ఆదివాసీ, దళిత సంఘాల నాయకులు బయల్దేరి వెళ్లారు. మండలంలోని సులుగుపల్లి నుంచి నాయకులు గురువారం ఈ సదస్సుకు తరలివెళ్లారు. ఆదివాసీ సంఘాల రాష్ట్ర నాయకులు సోయం చిన్నన్న, గోండ్వాన ఆదివాసీ కోయా సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్, కుల నిర్మూలన వేదిక రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్, ప్రాణహిత చేవెళ్ల భూ నిర్వాసితుల సంఘం నాయకుడు తలండి భిక్షపతి, సంఘాల నాయకులు ఆత్రం అరుణ్, ఎంపీటీసీ సాయన్న, సడ్మేక రమేశ్, కొడప సత్యవాన్, ఆత్రం పోషన్న, కామెర శంకర్, పొర్తెటి నాగేశ్ ఉన్నారు.

పత్తి రైతు పరేషాన్!

- రోజురోజుకూ పడిపోతున్న ధర
- తప్పక విక్రయిస్తున్న కొందరు రైతులు
- ధర పెరుగుతుందనే ఆశతో నిల్వ ఉంచిన మరికొందరు
- ఇంట్లో పత్తితో ఆరోగ్య సమస్యలంటూ వైద్యుల హెచ్చరిక



రైతు ఇంట్లో నిల్వ ఉన్న పత్తి

కౌటాల: జిల్లాలోని పత్తి రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. గతేడాది క్వింటాల్‌కు రూ.9 వేలకు పైగా పలికిన పత్తి ధర, ఈ ఏడాది ప్రస్తుతం రూ.7 వేలు మాత్రమే ఉంది. ఏటికేడు పెరగాల్సిన ధరలు క్రమంగా తగ్గుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది క్వింటాలుకు రూ.2వేల వరకు ధర కోతపడటం విస్మయానికి గురి చేస్తోంది. అక్టోబర్‌లో ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు ఇంకా పూర్తి కాలేదు. ఇక ధరలు పెరగవని ఇళ్లల్లో నిల్వ ఉన్న పత్తిని రైతులు క్రమంగా విక్రయిస్తున్నారు.

పతనమవుతున్న ధర

ఈసారి జిల్లాలో రైతులు 3.5లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగు చేశారు. భారీ వర్షాలు, తెగుళ్లు పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. రైతులు ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి రాలేదు. పత్తి పంట సాగుకు పెట్టుబడులు పెరిగినా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని పత్తి పంటకు మద్దతు ధర రూ.15 వేలకు పెంచాలని రైతులు పలుమార్లు జిల్లాకేంద్రంలో ఆందోళనలు చేపట్టారు. అయినా రోజురోజుకూ పత్తి ధర పతనమవుతూనే ఉంది. ఇక ధరలు పెరగవని కొందరు రైతులు ఇళ్లల్లో నెలల తరబడి నిల్వ ఉంచిన పత్తి పంటను విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి ధర క్వింటాల్‌కు రూ.7500 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు, దళారులు రైతులకు కేవలం రూ.6800 నుంచి రూ. 7000 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

పత్తి నిల్వతో అనర్థాలు

పత్తి ధర పడిపోతున్నా పలువురు రైతులు ఇంకా ఇళ్లలోనే నిల్వ ఉంచుతున్నారు. ధర పెరుగుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. దీంతో ఇళ్లలోని చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. నెలల తరబడి పత్తి నిల్వతో సూక్ష్మక్రిములు, పురుగులు వృద్ధి చెంది ఎలర్జీకి కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఒంటిపై దద్దుర్లు రావడం, మంటగా ఉండటంతోపాటు దురద పెట్టడం, కళ్లు ఎర్రగా మారడం లక్షణాలు సంభవిస్తాయని పేర్కొంటున్నారు. కాగా పత్తి నిల్వ కారణంగా పత్తిలో పలు క్రిములు తయారు కావడంతో పత్తిని వ్యానులో నింపే కూలీలు సైతం పలు వ్యాధుల బారిన పడుతున్నారు.

మద్దతు ధర పెంచాలి



పత్తి ధర పెరుగుతుందనే ఆశతో ఐదు నెలలుగా పత్తిని ఇంట్లో నిల్వ ఉంచుతున్నాను. కానీ పత్తి ధర పెరగడం లేదు. రోజురోజుకూ తగ్గుతుండడంతో ఆందోళన చెందుతున్నాం. పత్తి నిల్వ ఉంచడంతో పత్తి ఎండిపోతుంది. ఇళ్లల్లో నిల్వ ఉండడంతో దురద వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం పత్తికి ధరను పెంచి రైతులను ఆదుకోవాలి.

– రామయ్య, యాపలగూడ

జాగ్రత్తలు పాటించాలి



రైతులు ఇంట్లో పత్తి నిల్వ ఉంచితే పలు రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. పత్తి నిల్వ కారణంగా దురద సమస్యలు వస్తాయి. చిన్న పిల్లలు పత్తిలో ఆటలు ఆడితే శ్వాసకోశ వ్యాధులు సోకే అవకాశం ఉంది. చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి. ప్రజలకు ఎలాంటి వ్యాధులు సోకిన వైద్యులను సంప్రదించాలి. అన్ని రకాల జాగ్రత్తలు పాటించి ఇంట్లో పత్తిని నిల్వ చేయాలి.

– నవత, వైద్యురాలు, కౌటాల

వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఫేర్‌వెల్ పార్టీ ఉల్లాసంగా.. ఉత్సాహంగా కొనసాగింది. ప్రథమ సంవత్సరం విద్యార్థులు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బతుకమ్మ పాటలు, గ్రూప్, బ్రేక్ డ్యాన్సులతో విద్యార్థులు అదరగొట్టారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కెరమెరి, ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పరుశురాములు, రాందాస్ మాట్లాడారు. మంచి లక్షణాలను అలవర్చుకోవాలని చెప్పారు. నవీన్ రెడ్డి, రాజు, శ్రీహరి, స్వామి, కిశోర్, విమల్, కుత్బొద్దీన్, బైరాగి, రాము, సునీల్ ఉన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

సిర్పూర్(టి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ (డీపీఐపీ) బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. గురుకులాల డీసీవో బాలరాజు, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



కేక్ కట్‌చేస్తున్న మహిళలు

కౌటాల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మండల వైద్యాధికారి నవత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడాలన్నారు. మహిళలు చదువుల్లో, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌నర్స్ వర్ష, సిబ్బంది అనిత, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి నూతన భవనం



భవన పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

- కొనసాగుతున్న పనులు
- 15వ ఆర్థిక సంఘం కింద రూ.1.50 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు

దహెగాం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి భవనం మంజూరైంది. రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. గత రెండు నెలల క్రితం మంజూరు కాగా, ప్రస్తుతం వీటి పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ పనులను కలెక్టర్ హేమంత్ బుధవారం బోర్కుడే పరిశీలించారు.

శిథిలావస్థలో భవనం

వర్షాకాలంలో పీహెచ్‌సీ భవనం పైకప్పు ఉరుస్తోంది. ఆసుపత్రికి వచ్చే రోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనం గోడలు పగుళ్లు తేలాయి. ఎప్పుడేం జరుగుతుందోనని సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. పలుమార్లు పత్రికల్లో 'శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం' అంటూ కథనాలు వచ్చాయి. ఎట్టకేలకు పీహెచ్‌సీకి నూతన భవనం మంజూరైంది.

9నెలల్లో పనులు పూర్తి!

భవన పనులను 9 నెలల్లోగా పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. నూతన భవనం నిర్మాణంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది స్థానికంగా ఉండడానికి వీలుంటుందని ఇక మెరుగైన వైద్య సేవలు అందే అవకాశాలు ఉన్నాయి.

పనులు కొనసాగుతున్నాయి

పీహెచ్‌సీ నూతన భవన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. నాణ్యతతో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. పనులను 9 నెలల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందుతాయి.

– రాజ్‌కుమార్ జేఈ

ప్రయాణం.. ప్రమాదకరం

- ప్రమాదకరంగా హట్టి ఘాట్ రోడ్డు
- పిట్టగోడ లేక పొంచి ఉన్న ముప్పు
- నిత్యం వాహనాల రాకపోకలు



పిట్టగోడ లేక ప్రమాదకరంగా హట్టి ఘాట్ రోడ్డు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ వైపు వెళ్లే హట్టి ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేయడం వారికి నిత్యకృత్యమైంది.

పట్టించుకోని అధికారులు

ఎక్కడైతే ఘాట్ రోడ్డు..మూలమలుపులు ఉంటాయో అక్కడ ఇరుపక్కలా పిట్టగోడలు నిర్మించాలని నిబంధనలున్నా అధికారులకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా జోడేఘాట్‌కు వెళ్లేదారిలో ఉన్న హట్టిఘాట్ రోడ్డుకు పిట్టగోడలు లేక ప్రమాదకరంగా మారాయి. జోడేఘాట్ నుంచి వచ్చే వేళ సుమారు అరకిలో మీటరు పూర్తిగా డౌనల్ ప్రాంతం ఉండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అది కాక ఆ దిగువ ప్రాంతంలో రోడ్డు కుడి పక్కన పూర్తిగా లోయలు ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలు లోయలో పడే ప్రమాదం ఉంది. మరో వైపు ఆ ప్రాంతంలో బీటీ కాకుండా సిమెంట్ రోడ్డు వేసి ఉండడంతో పాటు.. చాలాచోట్ల గుంతలు పడి ఉన్నాయి. అనేకసార్లు అక్కడ వాహనాలు అదుపుతప్పిన సందర్భాలు ఉన్నాయి. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు.



అతి సమీపంలో ఉన్న మూలమలుపులు

12 గ్రామాలు..ఎనిమిది మూలమలుపులు

మండలంలోని జోడేఘాట్ వైపు పిట్టగూడ, టోకెన్ మోవాడ్, చాల్‌బాడి, పాటాగూడ, శివగూడ, లైన్ పటార్, చిన్న, పెద్ద పాట్నాపూర్, కొలాంగూడ, జోడేఘాట్ తదితర మొత్తం 12 గ్రామాలు ఉన్నాయి. వారు ప్రతినిత్యం ఏవో పనుల నిమిత్తం కెరమెరికి రాక తప్పదు. ఇలాంటి క్రమంలో హట్టి ఘాట్ రోడ్డు తప్ప ఇతర మార్గం లేదు. 8 మూలమలుపులు ఉన్నాయి. ప్రైవేటు వాహనాలు ప్రతిరోజు ప్రయాణం చేస్తుంటాయి. మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేవు. ఈ క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని వారు భయపడుతున్నారు. అధికారులు స్పందించి ఘాట్ రోడ్డుపై పిట్టగోడలు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదం పొంచి ఉంది



చాలా కాలం నుంచి రోడ్డు ఉన్నప్పటికి హట్టి ఘాట్‌పై ప్రమాద సూచికలు లేవు. ఎలాంటి పిట్టగోడ లేకపోవడంతో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు లోయలో పడిపోయో ప్రమాదం ఉంది.

– రాథోడ్ నిరంజన్‌దాస్, బాబేఝరి

భయంగా ప్రయాణం



ప్రతి ప్రయాణం చేస్తున్న ప్రజలు భయంభయంగా ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి. మూలమలుపులు ఉండడంతో దిగే వేళ డౌనల్ ప్రాంతంగా ఉంది. దీంతో అధికారులు స్పందించి పిట్టగోడ నిర్మించాలి.

– సిడాం మానిక్‌రావు, శివగూడ



పొగమంచు కాదు..దుమ్ము

వాంకిడి: ఇది మండల కేంద్రంలో కమ్ముకునే పొగమంచు అనుకుంటే పొరపాటే..! నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్ ఇష్టారీతిన చేస్తున్నారు. పనుల్లో సున్నం మట్టి పోసి అలాగే వదిలేశారు. దీంతో దుమ్ము లేవడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ విమలబాయి

వాంకిడి: ప్రతిఒక్కరూ అధ్యాత్మికత అలవర్చుకోవాలని ఎంపీపీ ముండె విమలబాయి సూచించారు. మండలంలోని చిన్న బెండార గ్రామంలో గురువారం నిర్వహించిన సద్గురు పూలాజీ బాబా ధ్యాన మందిరం వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఏడాది వార్షికోత్సవాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం అలవాటు చేసుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. బాబా కుమారుడు కేశవ్, సర్పంచ్ భాగ్యశ్రీ, బీఆర్ఎస్ నాయకులు దీపక్ ముండె, అన్నారావు, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు అన్యాయం జరిగితే ఆందోళనలు'

కాగజ్‌నగర్‌టౌన్: రైతులకు అన్యాయం జరిగితే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని పార్టీ నాయకుడు రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పత్తి క్వింటాల్‌కు రూ.10 వేల నుంచి 11 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా



శంకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్: అధైర్య పడొద్దని ఆపద సమయంలో అండగా ఉంటానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సూర్ల శంకర్ గత కొద్ది రోజుల క్రితం ఓ ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. మెరుగైన వైద్యం అనంతరం గురువారం తిరిగి ఇంటికి చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనప్ప ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ డొకే వెంకన్న, పాపన్నపేట సర్పంచ్ భుజాడి శేఖర్, ఎంపీటీసీ లంగారి శ్రీను, నాయకులు రాజారామ్, జావిద్, నారాయణ, తిరుపతి, పూర్ణం వైకుంఠం, పెద్దల శంకర్, ఏనుక శ్రీహరి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బెజ్జూర్: మండలంలోని ఎల్కపెల్లికి చెందిన తదిలా ఎల్లక్క గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరింది. వైద్యఖర్చుల నిమిత్తం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.56 వేలు మంజూరయ్యాయి. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, నాయకులతో కలిసి ఆమె కుమారుడు ఇస్తారికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సకారాం మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ డొకే వెంకన్న, తోటమాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట్రంగి రామకృష్ణ, పాపన్నపేట సర్పంచ్ భుజాడి శేఖర్, ఎంపీటీసీ లంగారి శ్రీను, పార్టీ నాయకులు ఇంజిరి రాజారామ్, జావిద్, నారాయణ, తిరుపతి, పూర్ణం వైకుంఠం, శంకర్, శ్రీహరి పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

బోథ్: తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సుజీత్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సొనాలలో పోస్టాఫీస్‌ను తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తపాలా సేవలను విస్తృతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. తపాలా పొదుపు ఖాతా ఎస్బీ ద్వారా పీఎం కిసాన్ గ్యాస్ సబ్సిడీ వంటి సౌకర్యాలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో మహ్మద్ మునీర్, బీపీఎం శ్రీనివాస్, దయానంద్ పాల్గొన్నారు.

రేపు సీఐటీయూ సర్వసభ్య సమావేశం

బెజ్జూర్: గ్రామ పంచాయతీ యూనియన్ సీఐటీయూ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 11న కాగజ్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల క్రిష్ణమాచారి తెలిపారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్‌లోని విద్యాధరి హైస్కూల్‌లో ఈనెల 11న ఉదయం ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు హాజరవుతారని తెలిపారు. సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు, మండలాల బాధ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో మండల కన్వీనర్ గోరంట్ల వసంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.